ఇథనాల్ సమస్య ముంచేస్తుంది: హరగోపాల్


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఇథనాల్ సమస్య రాష్ట్రాన్ని ముంచేస్తుందని ప్రొఫెసర్ హరగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో చిత్తనూరు ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో 'తెలంగాణలో ఇథనాల్ పరిశ్రమ- ప్రజల భవిష్యత్తు'అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని హరగోపాల్ మాట్లాడుతూ ప్రధాన రాజకీయ పార్టీలు ఇథనాల్ సమస్యపై తమ వైఖరిని ప్రకటించాలన్నారు. పార్లమెంటు ఎన్నికలు వస్తున్నందున ఆయా పార్టీలు ఈ కంపెనీపై స్పందించాలని కోరారు. ప్రముఖ సైంటిస్ట్ బాబురావు మాట్లాడుతూ ఇథనాల్ కంపెనీలు లాభాల కోసం కాలుష్యాన్ని విపరీతంగా వెదజల్లుతున్నాయని ఆరోపించారు. పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య మాట్లాడుతూ ఇథనాల్ కంపెనీలు వెదజల్లే కాలుష్యం విషయంలో కాలుష్య నియంత్రణ సంస్థలు ఏమి చేస్తున్నాయని ప్రశ్నించారు. ఇథనాల్ ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ శాస్త్రవేత్త సాగర్ దారా, రైతు సంఘం నాయకులు పశ్య పద్మ, పీవోడబ్ల్యూ కార్యదర్శి ఝాన్సీ, న్యూ డెమోక్రసీ కార్యదర్శి కె.గోవర్ధన్, పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం.రాఘవచారి, ప్రొఫెసర్ జి.లక్ష్మణ్, సామాజికవేత్త సంఘమిత్ర, కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి ప్రధాన కార్యదర్శి చక్రవర్తి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధి శూన్యం: బీఆర్‌ఎస్


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

ముషీరాబాద్: కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఐదు సంవత్సరాలలో ముషీరాబాద్‌కు చేసిన అభివృద్ధి శూన్యమని బీఆర్‌ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆరోపించారు. గురువారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఐదేళ్లల్లో చేసిన అభివృద్ధిపై ప్రగతి నివేదిక పేరుతో నిర్వహించిన కార్యక్రమాన్ని నిరసిస్తూ భోలక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వై.శ్రీనివాస్‌రావు మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రజలను మభ్యపెట్టేందుకు కిషన్‌రెడ్డి ప్రజా నివేదిక పేరిట మోసం చేస్తున్నారని ఆరోపించారు. ముషీరాబాద్‌లోని భోలక్‌పూర్‌లో అధికంగా పేదలు ఉన్నప్పటికీ ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలు అందించలేదన్నారు. కేవలం ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గత నెల రోజులుగా కార్పొరేట్ సంస్థల నిధులతో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారేతప్ప ప్రజలకు చేసిందేమీలేదని ధ్వజమెత్తారు. ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు కొండా శ్రీధర్‌రెడ్డి, భోలక్‌పూర్ డివిజన్ బీసీ సెల్ అధ్యక్షుడు ఉమాకాంత్, డివిజన్ నాయకులు రహీం, మహ్మద్ ఆలీ పాల్గొన్నారు.

30న ఎ.ఎస్.రావు టెలీఫిలిం మహామనిషి ప్రదర్శన


ట్రైలర్ విడుదల సందర్భంగా మాట్లాడుతున్న ఏఎస్ రావు విజ్ఞన వేదిక ప్రతినిధులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మహోన్నతమైన మానవతావాది పద్మభూషణ్, సైంటిస్ట్ డాక్టర్ ఎ.ఎస్.రావు జీవిత చరిత్రకు సంబంధించిన మహామనిషి టెలీఫిలింను ఈ నెల 30వ తేదీన సాయంత్రం 5 గంటలకు ఏఎస్‌రావు నగర్‌లోని హోమిజీ బాబా హాల్‌లో ప్రదర్శించనున్నట్లు డాక్టర్ ఏ.ఎస్.రావు విజ్ఞాన వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గొడుగు యాదగిరిరావు, పి.బి.చారి తెలిపారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దాశరథి ఫిలిం సొసైటీ అధ్యక్షుడు ఎస్.వినయ్‌కుమార్ టెలీఫిలికు సంబంధించిన ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక మందికి జీవితాలు ఇచ్చి ఆదుకున్న గొప్ప వ్యక్తి డాక్టర్ ఎ.ఎస్.రావు అని కొనియాడారు. ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన ఏఎస్ రావును స్మరించుకోవడం అదృష్టమన్నారు. కార్మికుల పట్ల ఎంతో ముందుచూపుతో వారిని కన్నబిడ్డల్లా చూసుకున్న వ్యక్తి అని పేర్కొన్నారు. వారి సేవలకు గుర్తుగా పద్మశ్రీ, పద్మభూషణ్, శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డులు కూడా వచ్చాయని గుర్తు చేశారు. ఈ సమావేశంలో టెలీఫిలిం డైరెక్టర్ రఘురాంచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న గడ్డం శ్యామ్, శ్రీను

ముషీరాబాద్: ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా వేసవికాలంలో తరగతులను నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్యామ్, ప్రధాన కార్యదర్శి శ్రీను డిమాండ్ చేశారు. గురువారం పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో మార్క్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇంటర్‌బోర్డు మార్చి 31వ తేదీ నుంచి ఇంటర్ కళాశాలలకు వేసవి సెలవులు ఇచ్చిందని తెలిపారు. కానీ, కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలు జేఈఈ, నీట్, ఎంసెట్ పేర తరగతులు నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. ఇంటర్‌విద్యలో శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థలు అడుగుపెట్టాక రోజుకు 16 నుంచి 18 గంటలపాటు చదువు పేర విద్యార్థులను హింసిస్తున్నారని అన్నారు. సమావేశంలో సంఘం గ్రేటర్ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి గౌతం, విద్యానగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్మానగర్‌లో సీతారాముల పల్లకీ ఊరేగింపు

ముషీరాబాద్: సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని భోలక్‌పూర్ డివిజన్‌లోని మహాత్మానగర్‌లో అభయ ఆంజనేయస్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సీతారాముల కల్యాణం అనంతరం బుధవారం రాత్రి సంప్రదాయ పద్ధతిలో సీతారాములను పల్లకీలో పుర వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్‌ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువ నాయకుడు ముఠా జైసింహా పల్లకీ ఊరేగింపునకు స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. అనంతరం దేవీచౌక్, ఎస్‌బీఐ కాలనీ, ఇందిరానగర్‌లో స్వామి వారి ఊరేగించారు. అడుగడుగునా భక్తులు స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. పల్లకీ ఊరేగింపు నిర్వాహకులు బిజ్జి కనకేష్‌కుమార్, వై.శ్రీనివాస్‌రావు, రాకేష్‌కుమార్, మహ్మద్ ఆలీ, నాయకులు సాయి తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలి

ఆర్.కృష్ణయ్య డిమాండ్


మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: జనగణనలో కుల గణన చేపట్టి పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలని, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో నిర్వహించిన కోర్ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ జనగణనలో కులగణన కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచడానికి అన్ని ప్రతిపక్ష పార్టీలు వచ్చే పార్లమెంటు సమావేశంలో ఒక్కటి కావాలన్నారు. ప్రభుత్వం దిగిరాకపోతే సమావేశాలను బహిష్కరించాలన్నారు. బీసీ కులాల మధ్య ఉన్న వ్యత్యాసాలకు తొలగించడానికి, గ్రూప్‌లుగా వర్గీకరించడానికి కులాలవారీగా జనాభా లెక్కలు ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు, వాటా కల్పించవలసిన సమయం ఆసన్నమైందన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికలలో ఏ రాజకీయ పార్టీ బీసీ కులగణన, పార్లమెంటులో బీసీ బిల్లు పెడతామని ప్రకటిస్తుందో ఆ పార్టీకే బీసీలు మద్దతు ఇస్తారన్నారు. గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, నంద గోపాల్, రామకృష్ణ, మధుసూదన్, ఉదయ్ నేత, సాయిరామ్, నిఖిల్‌సాయి, హరీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ.. నగదు పట్టివేత



చిక్కడపల్లి : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా బాగ్ లింగంపల్లిలో చిక్కడపల్లి పోలీసుల బృందం వెహికిల్ చెక్ చేస్తుండగా ఒక వ్యక్తి నుంచి మూడున్నర లక్షలకుపైగా నగదును స్వాధీనం చేసుకున్నారు. బృందం సభ్యులు వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం 12 గంటలకు స్టేషన్ పరిధిలోని బాగ్ లింగంపల్లి అచ్చయ్యనగర్ వద్ద వాహనాలు చెక్ చేస్తుండగా కిషోర్‌కుమార్ అనే వ్యక్తి హోండా ఎస్పీ 125 వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రూ.3లక్షల 52 వేలను పట్టుకున్నారు. ఆ డబ్బులకు సంబంధించిన పత్రాలు చూపించకపోవడంతో ఆ డబ్బులు సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య వివరించారు. సీజ్ చేసిన డబ్బులను పోలీసుల ద్వారా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

వారసత్వ సంపదను భావితరాలకు అందించాలి

రైల్వే అదనపు జనరల్ మేనేజర్ ధనంజయులు


రైల్వేస్టేషన్‌లో చుక్‌చుక్ రైలు ఆటలో విద్యార్థులు

కాచిగూడ: తరతరాలుగా వస్తున్న మన దేశ వారసత్వ సంపదను భావితరాలకు అందించేందుకు కృషి చేయాలని దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ ఆర్.ధనంజయులు పిలుపునిచ్చారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా కాచిగూడ రైల్వే స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌లోని రైలు మ్యూజియాన్ని ఆయన సందర్శించారు. రైల్వేల ఆవిర్భావం, అభివృద్ధికి అద్దం పట్టేలా అద్వితీయమైన 'రైలు మ్యూజియం'రూపొందించబడటానికి రైల్వే హైదరాబాద్ డివిజన్ చేసిన కృషిని అభినందించారు. వారసత్వ సంపదను కాపాడే దిశలో భాగంగా స్మారక కట్టడాలు, ప్రదేశాల సంరక్షణలో ఎల్లవేళలా రైల్వే ముందంజలో ఉందని అన్నారు.

ఆకట్టుకున్న వీధి నాటకం

మ్యూజియంలో స్వాతంత్ర్యానికి పూర్వం మనుగడలో ఉన్న వివిధ రైల్వేల లోగోలను ప్రదర్శించే ఒక చిత్రపటాన్ని ఈ సందర్భంగా ధనంజయులు ఆవిష్కరించారు. సావనీర్, కాఫీ మగ్‌ను విడుదల చేశారు. వారసత్వాన్ని కాపాడుకోవడం అనే అంశంపై ఉద్యోగులు, విద్యార్థులు వీధినాటకాన్ని ప్రదర్శించారు. అనంతరం చిత్రలేఖనం, వకృత్వం, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రైల్వే చీఫ్ వర్క్ షాప్స్ ఇంజనీర్స్ శివేంద్ర మోహన్, హైదరాబాద్ ఏడీఆర్ఎం ఎం.ఎ.రహమన్, డీజీఎం ఎ.శ్రీధర్, సీనియర్ డీపీవో జి.ఆర్.సుధీర్ కుమార్, రైల్వే అధికారులు కేశవ్ కష్లస్, ప్రశాంత్ కుమార్, సందీప్, టి.బబ్బులూ, కె.గోవింద్ రావు, శ్రీనివాస్, కాచిగూడ స్టేషన్ డైరెక్టర్ కె.బాలాజీ, స్టేషన్ మేనేజర్ ఆర్.బి.మీనా, రైల్వే ఉద్యోగులు, కళాకారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

23 వరకు రైలు మ్యూజియం ఉచిత సందర్శన

ప్రపంచ వారసత్వ దినోత్సవాల దృష్ట్యా ఈ నెల 23వ తేదీ వరకు సాధారణ ప్రజలకు, విద్యార్థులకు రైలు మ్యూజియంలోకి ఉచిత ప్రవేశం కల్పించినట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. సందర్శన వేళలు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది.


నిజాం రైల్వేఫొటోలు పరిశీలిస్తున్న ధనంజయులు


వివిధ రైల్వేల లోగోలను తిలకిస్తున్న దృశ్యం


బహుమతులు అందజేస్తున్న ధనంజయులు

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష


నితీష్ సింగ్(ఫైల్)

నల్లకుంట: మైనర్ బాలికలను లైంగికంగా వేధించాడన్న కేసులో ఓ నిందితుడిపై ఆరేళ్ల క్రితం పోక్సో కేసు నమోదు కాగా తాజాగా అతనికి జైలుశిక్ష విధిస్తూ నాంపల్లి స్పెషల్ సెషన్స్ కోర్టు జడ్జి తీర్పునిచ్చారు. నల్లకుంట ఎస్‌హెచ్‌వో బి.జగదీశ్వర్ రావు తెలిపిన వివరాలు... జియానగర్, ఇందిరానగర్‌లో నివాసముండే కిలాయివాల నితీష్‌సింగ్(20) 2018లో బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడంటూ ఓ వ్యక్తి నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో అతనిపై నల్లకుంట పీఎస్‌లో పోక్సో కేసు నమోదైంది. గురువారం ఈ కేసు పూర్వాపరాలను నాంపల్లి సెషన్స్ కోర్టు జడ్జీ పి.పుష్పలత పరిశీలించి నిందితుడు నితీష్ సింగ్‌కు 20 సంవత్సరాల జైలుశిక్షతోపాటు రూ. 5 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించలేని పక్షంలో మరో ఆరు నెలల జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పు వెల్లడించారు.

వాష్‌రూమ్‌కని వెళ్లిన మహిళ అదృశ్యం


మేఘన

కాచిగూడ: వాష్‌రూమ్‌కని చెప్పి వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింఎస్‌ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం... అజంపురకు చెందిన నాగేశ్వర్‌రావు కుమార్తె ఎస్.మేఘన(24) కుటుంబసభ్యులతో కలిసి వైద్యం కోసం కాచిగూడ, చెప్పల్‌బజార్‌లోని ఎస్‌వీఎస్ హాస్పిటల్‌కు వెళ్లారు. వాష్‌రూమ్‌కు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లింది. ఎంతకూ తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు వివిధ ప్రాంతాల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యం


నవీన

చిక్కడపల్లి: ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బండమైసమ్మనగర్‌లో చోటుచేసుకుంది. దోమలగూడ సీఐ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... బండ మైసమ్మనగర్‌లో నివాసం ఉండే ఎం.నవీన(28) ఇందిరాపార్కు సమీపంలోని ఓ ఇంట్లో పనిమనిషిగా చేరింది. ఈ క్రమంలో ఈ నెల 19న ఇంట్లో ఎవరికీ సమాచారం ఇవ్వకుండా బయటకు వెళ్లిపోయి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితులు ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె భర్త శ్రావణ్‌కుమార్ గురువారం దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గత జనవరిలో కూడా ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగివచ్చినట్లు పోలీసులు తెలిపారు.

19న జాతీయస్థాయి బీసీల మేధోమథన సదస్సు

ఆర్.కృష్ణయ్య


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీల రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన గురువారం కాచిగూడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 19న బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జాతీయ స్థాయి బీసీల మేధోమథన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా 90 కుల సంఘాలు, 26 బీసీ సంఘాలు, 30 ఉద్యోగ, విద్యార్థి, యువజన, మహిళా సంఘాల ప్రతినిధులు, మేధావులు సదస్సులో పాల్గొంటారని చెప్పారు. జాతీయ స్థాయిలో అన్ని రాజకీయ పార్టీలు బీసీలపట్ల తమ వైఖరిపై విధాన ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, నందగోపాల్, టి.రాజ్‌కుమార్, నిఖిల్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్‌లో ఐపీఎల్ టికెట్ల విక్రయంపై చర్య తీసుకోవాలి

యువజన సంఘాల నేతల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్.ప్రదీప్

ముషీరాబాద్: ఐపీఎల్ క్రికెట్ టికెట్లను బ్లాక్‌లో విక్రయిస్తున్న హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ), సన్‌రైజర్స్ యాజమాన్యాలపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, హెచ్‌సీఏ బోర్డు అవినీతి అక్రమాలపై ఉన్నత స్థాయి కమిటీని నియమించి విచారణ జరపాలని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్.ప్రదీప్ డిమాండ్ చేశారు. విద్యానగర్‌లోని మార్క్స్ భవన్ పీవైఎల్ కార్యాలయంలో యువజన సంఘాల సమావేశాన్ని నిర్వహించారు. అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వలీ ఉల్లాఖాద్రి, ప్రధాన కార్యాదర్శి కె.ధర్మేంద్ర, డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉప్పల్ స్టేడియంలో ఈ నెల 25న సన్‌రైజర్స్ హైదరాబాద్–రాయల్ చాలెంజర్స్ జట్ల మధ్య మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లను ఆన్‌లైన్‌లో పెట్టకుండా బ్లాక్‌లో అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు రవి కుమార్, భూషణవేణి కృష్ణ, నగర నాయకులు బండారి శ్రీనివాస్, కొల్లూరు భమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ దిష్టిబొమ్మ దహనం


ఏబీవీపీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు, విద్యార్థులు

కాచిగూడ: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఎస్‌ఎఫ్‌ఐ నేతలపై ఏబీవీపీ విద్యార్థుల దాడిని ఖండిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నారాయణగూడ చౌరస్తాలో ఏబీవీపీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎల్ మూర్తి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్‌రెడ్డి మాట్లాడుతూ నిత్యం విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వాలు, అధికారులతో కొట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలపై దాడి చేయడం సిగ్గుచేటని అన్నారు. సైద్ధాంతికంగా ఎస్‌ఎఫ్‌ఐని ఎదుర్కోలేక ఆర్థిక బలం, సెంట్రల్ యూనివర్సిటీలో యూనియన్ అధ్యక్షుడు అతీక్, కార్యదర్శి కృపాజార్జ్‌తోపాటు మరో 20 మంది విద్యార్థులపై, మహిళలపై ఏబీవీపీ నేతలు దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. నిరసన కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నేతలు మమత, దామెర కిరణ్, లెనిన్ గువేరా, రమ్య, స్టాలిన్, సుష్మ, భావన, నందిని, ఇందర్‌జిత్, అబ్దుల్లా, సంకేత్, ఇంద్రనీల్, వేణు తదితరులు పాల్గొన్నారు.

21న ఏవీ సావిత్రి లలిత సంగీత పోటీల రజతోత్సవం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: ప్రముఖ సాంస్కృతిక సంస్థ నవ్య నాటక సమితి ఆధ్వర్యంలో అలనాటి ప్రముఖ గాయని, ఆకాశవాణి ఏవీ సావిత్రి లలితసంగీత పోటీల రజతోత్సవ కార్యక్రమాన్ని ఈ నెల 21న త్యాగరాయగానసభలో నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు వేమరాజు, సమన్వయకర్త సుధామాల తెలిపారు. ఈ సందర్భంగా నృత్య నాటిక ప్రదర్శన లలితసంగీత విభావరి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం వివరాలు తెలిపే పోస్టర్‌ను గురువారం చిక్కడపల్లిలోని సంస్థ కార్యాలయంలో విజయ్, సుధామాలతోపాటు నృత్యకళాకారులు మధుమతి కులకర్ణి స్నేహరామ్‌చందర్, లక్ష్మీమానస, కోశాధికారి హరినాథ్‌బాబు ఆవిష్కరించారు.

నామినేషన్‌కు ముందు కిషన్‌రెడ్డి ఆలయాల దర్శనం

అంబర్‌పేట: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థిగా నేడు(శుక్రవారం) నామినేషన్ వేయనున్నారు. ప్రతి ఎన్నికల్లో కిషన్‌రెడ్డి సెంటిమెంటుగా బషీర్‌బాగ్‌లోని కనకదుర్గ, నాగలక్ష్మి అమ్మవార్ల ఆలయం, నల్లకుంట శంకర్‌మఠ్, అంబర్‌పేటలోని మహంకాళి ఆలయాలను సందర్శిస్తారు. ప్రత్యేక పూజలు నిర్వహించి నామినేషన్ దాఖలు చేయాడానికి వెళ్తారు. ఈసారి కూడా ఈ ఆలయాలను సందర్శించిన అనంతరం సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ కార్యాలయంలో నామినేషన్ వేయనున్నారు.నీ మేరకు లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఆయా అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందట్లా పార్టీ శ్రేణులు సన్నాహాలు చేస్తున్నాయి.

బీజేపీ మేనిఫెస్టోలో 'పర్యావరణ'కు చోటేదీ?

కాచిగూడ: బీజేపీ మేనిఫెస్టోలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ప్రస్తావన లేకపోవడం హాస్యాస్పదంగా ఉందని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్‌సీహెచ్ రంగయ్య, జాతీయ సలహాదారుడు డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛ భారత్ అంటూ మాయమాటలు గుప్పించే బీజేపీ జాతీయ నాయకత్వం ఎన్నికల వేళ ఆ విషయాన్ని మర్చిపోవడం విడ్డూరంగా ఉందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత పదేళ్ల నుంచి స్వచ్ఛత గురించి మాట్లాడుతున్న ఆ పార్టీకి పర్యావరణంపై ఏపాటి బాధ్యత ఉందో తేటతెల్లమైందని, ఈ రకమైన ఉదాసీనత వైఖరి తగదని అన్నారు.

అలరించిన భక్తిసంగీత కచేరి


భక్తిగీతాలు ఆలపిస్తున్న పోపూరి శ్రీనివాసశర్మ, యశస్విని

నల్లకుంట: శ్రీరామనవమిని పురస్కరించుకొని శ్రీ సరస్వతి సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తి సంగీత కచేరి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బృందగానం, అనంతరం ప్రముఖ సంగీత విద్వాంసుడు, పంచశతవీణా గానరత్న పోపూరి శ్రీనివాస శర్మ ఆలపించిన భక్తిగీతాలు ఆద్యంతం అలరించాయి. దీనికి వర్ధమాన గాయిని యశస్విని సహగానం అందించారు. బేబీ హిరణ్య ఆలపించిన కీర్తన, వింధ్య, ప్రణతి, రాగిణి, దివిజ, విదిష, శ్రేయాస్, చేతస్‌శర్మ గానం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సాయిబాబా సంస్థాన్ ప్రతినిధులు శ్రీనివాసశర్మను సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరాముడికి పట్టాభిషేకం



చిక్కడపల్లి: శ్రీరామనవమివేడుకలను పురస్కరించుకుని వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం, ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని శ్రీ లక్ష్మీగణపతి దేవాలయాలలో గురువారం సాయంత్రం అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రీరాముడికి పట్టాభిషేకం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై క్రతువును వీక్షించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రసాదవితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓలు ఎం.దేవనాథం, పి.లక్ష్మారెడ్డి, అర్చకులు, సిబ్బంది, మాజీ కార్పొరేటర్ అరుణ, నేతలు జయేందర్‌బాబు,, యాదగిరిగౌడ్, గుర్రం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రేష్మాకు ఎమ్మెల్యే అభినందన



అంబర్‌పేట: వైద్యవిద్యలో జెస్వాల్ గార్డెన్‌కు చెందిన డాక్టర్ రేష్మా జాతీయస్థాయిలో బంగారు పతకం సాధించింది. నేషన్‌లో బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్సెస్(ఎన్‌బీఈఎంఎస్) జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈఎన్‌టీ విభాగం, డీఎన్‌బీ తుదిపరీక్షల్లో మొదటిర్యాంకు సాధించిన డాక్టర్ రేష్మాను గురువారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. మే 10న న్యూఢిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా బంగారు పతకం అందుకోవడం తెలంగాణకు ఎంతో గర్వకారణమని ప్రశంసించారు. డాక్టర్ రేష్మా కోఠి ఈఎన్‌టీ ఆసుపత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చింతల శ్రీనివాస్ ముదిరాజ్, రమేశ్‌గౌడ్, రామన్‌గౌడ్ తదితరులు పాల్గోన్నారు.

ఆలయ వార్షికోత్సవం


పూజలు నిర్వహించిన కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

చిక్కడపల్లి: చిక్కడపల్లి బాపునగర్‌లో శ్రీ రాజరాజేశ్వరి దేవాలయం 40వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం వివిధ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శివపార్వతుల లీలా మహోత్సవం, జయాది హోమం, మహాపూర్ణాహుతి, మహేశ్వర ఘన ఆశీర్వచనం, కల్యాణ, శివపార్వతుల ఉత్సవ మూర్తుల గ్రామ సందర్శనం(ఊరేగింపు), వీరపురంతులచే నందికోల సేవ నిర్వహించారు. స్థానిక గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ దంపతులు, బీజేపీ నేతలు దామోదర్, రాజేందర్, భక్తులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రామాయణానికి రాముడే కథానాయకుడు


కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న చంద్రమౌళి, బడేసాబ్ తదితరులు

చిక్కడపల్లి: రామాయణానికి రాముడే కథానాయకుడని, అతనే ధర్మనేత అని వేద ప్రచారకులు ఎం.కృష్ణారెడ్డి అన్నారు. గీతా ఫౌండేషన్, గోప్రచారక సేవా సమితి, కుసుమ ధర్మన్నగారి కళాపీఠం ఆధ్వర్యంలో గురువారం రాత్రి త్యాగరాయ గానసభలో శ్రీరామనవమి సందర్భంగా శ్రీరామ వైభవం అనే అంశంపై ప్రసంగం, కవి సమ్మేళనం జరిగింది. ఆయన మాట్లాడుతూ రామాయణం రాముని జీవనప్రయాణమేన్నారు. నిర్వాహకులు బడేసాబ్, ప్రముఖ కవి, విమర్శకులు రామకృష్ణ చంద్రమౌళి, గంటా మనోహర్‌రెడ్డి, కరుణాకర్ గుప్త, దామోదర్‌రావు, చంద్రప్రకాశ్ రెడ్డి, అంజనీకుమారి, సరోజినీదేవి, దేవేందర్‌గుప్త పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు అభినందన


ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డిని అభినందిస్తున్న అబ్దుల్ కబీర్

కాచిగూడ: రంజాన్, శ్రీరామనవమి వేడుకల సందర్భంగా కాచిగూడ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారని హోంశాఖ మాజీ ఏజీపీ అబ్దుల్ కబీర్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అడ్వొకేట్ సయ్యద్ బాబు, యూసుఫ్, అక్బర్, సోహిల్ తదితరులు పాల్గొన్నారు.